క్లుప్తంగా

రేషన్ డిపోలకు దరఖాస్తుల స్వీకరణ



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి

పెద్దాపురం: డివిజన్ పరిధిలోని 11 మండలాల నుంచి 50 రేషన్ డిపోలకు దరఖాస్తులు కోరగా 180 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి తెలిపారు. శనివారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రేషన్ దుకాణాలకు 1వ తేదీ నోటిఫికేషన్ జారీ చేయగా 8వ తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరించామన్నారు. వీటికి గాను 180 దరఖాస్తులు వచ్చాయని, వీరందరికీ 12వ తేదీ నుంచి హాల్ టిక్కెట్లు జారీ చేస్తామన్నారు. 19న స్థానిక మహారాణి కళాశాల వద్ద రాత పరీక్ష ఉంటుందన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. 80 మార్కులకు రాత పరీక్ష ఉంటుందని, ఉదయం పది గంటల లోపే అభ్యర్థులంతా పరీక్షా హాల్‌కు చేరుకోవాలన్నారు.అర్హత మార్కులు సాధించిన వారిని మాత్రమే మౌకిక పరీక్షలకు ఆహ్వానిస్తామని తెలిపారు.

ఎక్కడి వాహనాలు అక్కడే..



మఠం సెంటర్‌లో నిలిచిపోయిన వాహనాలు

సామర్లకోట: ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి.. ఆటోలు రోడ్లపై నిలిపి వేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. శనివారం స్థానిక మఠం సెంటర్‌లో రోడ్డుపై ఆటో నిలిపి సామాన్లు కొనుగోలు చేసుకోవడానికి పలువురు వెళ్లడంతో ఆ రోడ్డుపై వాహనాలు నిలిచిపోయాయి. దాంతో స్థానికులు ఆటో డ్రైవర్‌ను మందలించడంతో ఆటో తీయడంతో ట్రాఫిక్ సమస్య పరిష్కారమైంది. ప్రయాణికులు కనిపిస్తే రోడ్డుకు మధ్యలో ఆటోలు ఆపి వేయడం వల్ల వెనుక వస్తున్న వారు ఇబ్బందులకు గురవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పట్టణంలో వన్‌వే అమలు చేస్తే ఇటువంటి సమస్య ఉండదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తం అవుతుంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రోడ్డు పక్కన వెంకటేశ్వరరావు మృతదేహం

కరప: పాతర్లగడ్డ సమీపంలో మోటార్ సైకిల్ ఢీకొనగా ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. కరప మండలం గొర్రిపూడి గ్రామానికి చెందిన కొమ్మోజు వెంకటేశ్వరరావు (60)కు మతిస్థిమితం సరిగా లేదు. గొర్రిపూడి, పాతర్లగడ్డ గ్రామాల్లో భిక్షాటన చేస్తున్నాడు. శనివారం రాత్రి రోడ్డుకు ఎడమ వైపు నుంచి నడచుకుంటూ అతను వెళుతుండగా గొర్రిపూడి వైపు నుంచి కాకినాడ వైపునకు వెళుతున్న మోటార్ సైక్లిస్ట్ వేగంగా నడుపుతూ వెంకటేశ్వరరావును బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి వరసకు కుమారుడు అయిన శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరప పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ టి.సునీత దర్యాప్తు చేస్తున్నారు.

వడ్డే ఓబన్న నేటితరానికి ఆదర్శం

కాకినాడ సిటీ: బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా, పేద రైతులు, గ్రామస్తుల హక్కులను కాపాడటంలో వడ్డే ఓబన్న కీలకపాత్ర పోషించారని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం కాకినాడ జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ షణ్మోహన్, బీసీ సంక్షేమ శాఖ అధికారులతో కలసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వతంత్ర పోరాటం ప్రారంభానికి ముందు 1857లో భారతదేశంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన ప్రతి ఘటనలో వడ్డే ఓబన్న ముఖ్య పాత్ర పోషించారన్నారు. స్వతంత్ర సంగ్రామంలో ఒక అధ్యాయంగా నిలిచి, వడ్డే ఓబన్నలోని ప్రజాస్వామ్య విలువలు, ధైర్య సాహసాలను ప్రజలకు తెలియజేయాలనే లక్ష్యంతో ఆయన జయంతి కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించడం శుభ పరిణామమని కలెక్టర్ తెలిపారు. 1807 జనవరి 11న నంద్యాల జిల్లా, సంజమల మండలం నొస్సం గ్రామంలో జన్మించిన వడ్డే ఓబన్న బ్రిటిష్ వారిపై పోరాటం చేశారన్నారు. ఆయన ధైర్య సాహసాలు నేటితరానికి ఆదర్శంగా నిలుస్తుందని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఎం.లల్లి, కాకినాడ డివిజన్ సహాయ బీసీ సంక్షేమాధికారి వీరభద్రప్రసాద్ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

బరితెగింపు..!

- బరుల ఏర్పాటులో కుమ్ములాట
- కూటమి నేతల్లో ఆధిపత్య పోరు
- పోటాపోటీగా బరుల ఏర్పాటు
- తలలు పట్టుకుంటున్న అధికారులు

పిఠాపురం: 'బరి'తెగించారు.. కోళ్ల పందేలకు సిద్ధమయ్యారు.. ఈ బరుల ఏర్పాటులో కూటమి నేతలు కుమ్ములాడుకుంటున్నారు.. పోటాపోటీగా బరులు ఏర్పాటు చేస్తున్నారు.. పిఠాపురంలో కూటమి నేతల వర్గపోరు సంక్రాంతి సంబరాలను వివాదాస్పదంగా మార్చే విధంగా మారాయి. సంక్రాంతికి కోడి పందేల్లో కోళ్లు కొట్టుకోక ముందే కూటమి నేతలు కుమ్ములాడుకుంటున్నారు. పందేల ఏర్పాట్లలో తమదే పైచేయి కావాలని ఆధిపత్య పోరుకు తెరలేపారు. ఏఊరిలో చూసినా టీడీపీ, జనసేన నేతలు వేర్వేరుగా బరులు ఏర్పాటుకు రంగం సిద్ధం చేసుకోవడంతో ఏం చేయాలో తెలియక అధికారులు తలపట్టుకుంటున్నారు. ఏటా కోడి పందేల నిర్వహణపై న్యాయస్థానం కన్నెర్ర చేస్తుంది. అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. కేవలం సంక్రాంతి మూడు రోజులు శాంతియుతంగా పందేల నిర్వహణకు సంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవడానికి అధికారులు వెసులుబాటు కల్పిస్తుంటారు. సాధారణంగా ఊరంతా ఒక్కటై గ్రామాల్లో కోడి పందేల బరులు ఏర్పాటు చేసుకుంటున్నారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా ఏ న్యాయస్థానం ఆదేశాలను పట్టించుకోకుండా వారం రోజుల ముందు నుంచే బరులు ఏర్పాట్లు సాగిస్తున్నా పట్టించుకునే నాథుడు కనిపించడం లేదు.

న్యాయస్థానం ఆదేశాలూ బేఖాతర్

సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు, జూదాలు నిర్వహించరాదని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను పిఠాపురం నియోజకవర్గంలో తుంగలో తొక్కుతున్నారు. గొల్లప్రోలుకు చెందిన టీడీపీ నేతలు ఏకంగా తమ గ్రామంలో కోడి పందేలు నిర్వహిస్తున్నాం.. రండి అంటూ సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెట్టడం చూస్తుంటే ఎంత బరి తెగించారో అర్థమవుతుంది. గొల్లప్రోలులో తయారు చేసిన బరిలో కూర్చుని టీడీపీ ఆధ్వర్యంలో బరి ఏర్పాటు చేశారమని టీడీపీ నేతల ఫోటోలతో పెట్టిన పోస్టింగ్‌లు చూసిన జనం మరీ ఇంత బరితెగింపా అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. వీరికేమీ తీసిపోమంటూ మరోపక్క జనసేన నేతలు తమ ఆధ్వర్యంలో బరుల ఏర్పాటు చేపట్టారు.

పోటాపోటీగా బరిల ఏర్పాట్లు

రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో టీడీపీ, జనసేన వేర్వేరుగా బరులను సిద్ధం చేస్తున్నారు. ఈనెల జనవరి ఒకటిన నూతన సంవత్సర వేడుకల్లో టీడీపీ అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ కోడి పందేలను నిర్వహించి కొత్త సంప్రదాయానికి తెర లేపారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి కొత్త సంవత్సరం కావడంతో పందేలు ప్రారంభించడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో జనసేన కార్యకర్తలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. పవన్ కళ్యాణ్ ఇక్కడ ప్రాతినిధ్యం వహిస్తుండగా కోడిపందేల బరులను ఎలాగైనా తామే ఏర్పాటు చేస్తామంటూ చెప్పుకొస్తున్నారు. ఇదే తరుణంలో నియోజకవర్గంలో ఉన్న పలు గ్రామాల్లో బరుల ఏర్పాట్లకు సిద్ధమయ్యారు. పిఠాపురం పట్టణంలో వైఎస్సార్ గార్డెన్లో టీడీపీ, జనసేన వేర్వేరుగా బరుల ఏర్పాటు పనులు సాగిస్తున్నారు. కోడి పందేలు, జూదాలకు ఎటువంటి అనుమతి ఇవ్వలేదని పిఠాపురం సీఐ శ్రీనివాస్ అన్నారు.

కాలుదువ్వుతున్న పందెం కోళ్లు

పెద్దాపురం: నియోజకవర్గంలో పందెం కోళ్లు కాళ్లు దువ్వుతున్నాయి. కూటమి నేతల అండదండలతో పందేం రాయుళ్లు ఏకంగా గుండాట ఐరన్ బోర్డులు తయారు చేయించి జూదాలకు సిద్ధమవుతున్నారు.



పిఠాపురంలో టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న బరి

కోడి పందేల నిర్వహణకు ఒక్కో గ్రామంలో ఒక్కో బరికి ఒక్కో ధర నిర్ణయించారు. పోలీస్, రెవెన్యూ అధికారులు అంటూ వాళ్ల మామూళ్ల పేరుతో కూటమి నేతలు పందెల నిర్వహణదారులకు ఒక్కో ధర నిర్వహించి బహిరంగంగానే పాటల ద్వారా రూ.లక్షల వసూళ్లకు తెర తీశారు. ఒక్కో గ్రామంలో రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షలు, అతి తక్కువ అయితే రూ.10 నుంచి 20 లక్షలు తీసుకున్నారు. పెద్దాపురం మండలం గుడివాడ, గోరింట, రాయభూపాలపట్నం, దివిలి, చంద్రమాంపల్లి, గోరింట, కాండ్రకోట, కట్టమూరు, పులిమేరు, సామర్లకోట మండలం అచ్చంపేట, పనసపాడు, వీకే రాయపురం, వేట్లపాలెం, మేడపాడు గ్రామాల్లో పందేల నిర్వహణకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. జూదాల జోలికి పోవద్దు.. సంప్రదాయ క్రీడలు ముద్దు అంటూ సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న పోలీస్ శాఖ వారి కనుసన్నల్లో పందేల బరులు సిద్ధమౌతున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తుంది. పండగ మూడు రోజుల అనంతరం కొంత మందిపై తూతూ మంత్రంగా కేసులు నమోదు చేసి వదిలేయడం పోలీస్ శాఖకు పరిపాటిగా మారిపోయింది.



పిఠాపురంలో జనసేన నిర్వహణలో బరి



గుండాటకు సిద్ధం చేసిన ఐరన్ బల్ల



పందేల నిర్వహణకు పనసపాడులో సిద్ధమైన బరి

ఉద్యోగులకు అండగా ఉంటాం

పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి

పెద్దాపురం: కింది స్థాయి సిబ్బందికి ఎప్పుడూ అండగా ఉంటూ సహాయ, సహకారాలు అందిస్తానని పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి అన్నారు. డివిజన్‌లోని క్లాస్ ఫోర్ ఉద్యోగులందరికీ శనివారం ఏకరూప దుస్తులను ఆమె చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కార్యాలయ డీటీ భానుకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సంక్రాంతి పర్వదినాన్ని ఆనందంగా జరుపుకోవాలన్నారు. ఉద్యోగులు సేవాగుణంతో మెలిగి సహాయ, సహకారాలు అందించుకోవాలని ఆర్డీఓ సూచించారు. క్లాస్ ఫోర్ ఉద్యోగుల సేవలను గుర్తించి దుస్తులను అందజేసిన ఆర్డీఓకు యూనియన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం డివిజన్ పరిధిలోని సుమారు 70 మంది క్లాస్ ఫోర్ ఉద్యోగులకు ఆమె చేతుల మీదుగా ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. కార్యాలయ ఏఓ మాధవరావు, సిబ్బంది పాల్గొన్నారు.



క్లాస్ ఫోర్ ఉద్యోగులకు దుస్తులు పంపిణీ చేసిన ఆర్డీఓ శ్రీరమణి

ఆరోపణ చేస్తున్న వారిని శిక్షించండి

కొత్తపల్లి: తాను గ్రూపు సభ్యుల సొమ్మును తినేశానంటూ తప్పుడు ఆరోపణ చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని వీఓఏ ఓసిపల్లి కృప ఆవేదన వ్యక్తం చేసింది. ఉప్పాడ బర్మాకాలనీలో ఉన్న తన స్వగృహం వద్ద గ్రూపు సభ్యులతో కలసి శనివారం ఆందోళన వ్యక్తం చేసింది. ఆరోపణలు చేస్తున్న ఒక విలేకరి, తిరంశెట్టి చిన్నిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా సమైక్యలో ఉప్పాడలోని ఒక వీఓఏగా ఆమె పదేళ్లుగా పని చేస్తుంది. ఇటీవల కొన్ని కారణాలతో గతంలో పని చేసిన ఏపీఎం పక్కన పెట్టిందన్నారు. ఆ మధ్యకాలంలో తిరంశెట్టి చిన్నికి తన బాధ్యతను అప్పగించారన్నారు. అయితే గత సంవత్సరం డిసెంబర్ నెలలో తనకు తిరిగి వీఓఏగా బాధ్యతలు అప్పగిస్తూ 30 గ్రూపుల సభ్యుల అంగీకారంతో ఎంపీ తంగెళ్ళ ఉదయ శ్రీనివాస్ లెటర్ ఇచ్చారన్నారు. విధులు నిర్వహిస్తున్న తనను గ్రూపు సభ్యుల నుంచి రూ. 27 లక్షలు తినేశానని చిన్ని, ఒక విలేకరి తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. ఆ విలేకరి తనను మానసికంగా వేధిస్తున్నాడంటూ వాపోయింది. ఆ ఇద్దరిపై పరువు నష్టం దావా వేస్తానని, కొత్తపల్లి పోలీసులకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఫిర్యాదు చేస్తానని కృప తెలిపింది.



గ్రూప్ సభ్యులతో కలసి ఆవేదన వ్యక్తం చేస్తున్న కృప

సంక్రాంతిని ఆనందంగా జరుపుకోవాలి

పిఠాపురం: సంక్రాంతి సంబరాలు ఆనందంగా చేసుకొనేందుకు యువత బాధ్యత వహించాలని పిఠాపురం జనసేన ఇన్‌చార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ సూచించారు. గొల్లప్రోలు హైస్కూల్‌లో శనివారం గొల్లప్రోలు 3 క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యువత ఆటపాటలకు మాత్రమే అవకాశం ఇవ్వాలి తప్ప జూదాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు యువత పాల్గొన్నారు.

గొల్లప్రోలులో..

పిఠాపురం: సంప్రదాయబద్ధంగా జరుపుకొనే సంక్రాంతి సంబరాల్లో జూదాలకు అవకాశం ఇవ్వకూడదని గొల్లప్రోలు ఎస్సై నౌడు రామకృష్ణ యువతకు సూచించారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో శనివారం పోలీసుల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ సంప్రదాయాలను జూదాలకు అనువదించకుండా ఆటపాటలతో పండగను ఆనందంగా చేసుకోవాలన్నారు. జూదాల వల్ల యువత జీవితాలను పాడు చేసుకుంటారని ఆయన అన్నారు. కుటుంబ సమేతంగా ఆనందోత్సాహాల మధ్య సంక్రాంతిని చేసుకోవాలి తప్ప గుండాటలు, పేకాటలు, కోడిపందాలు వంటి వాటికి అవకాశం ఇవ్వకూడదన్నారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

కొత్తపల్లి: గ్రామాల్లో కోడిపందాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై వెంకటేష్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం పర్యటించారు. కోడిపందాల కోసం ఏర్పాటు చేస్తున్న బరులను జేసీబీలతో దున్నించారు. ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో జూదాలు, కోడిపందాలు నిర్వహిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు ఉంటాయన్నారు. సంక్రాంతిని కుటుంబ సభ్యుల మధ్య ఆనందంగా చేసుకోవాలని సూచించారు. కోడి కత్తులు తయారు చేసిన, కోళ్లకు కత్తులు కట్టిన వారిపై రౌడీషీట్లు తెరవడం జరుగుతుందన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న గొల్లప్రోలు ఎస్సై నౌడు రామకృష్ణ



ఏర్పాటు చేస్తున్న కోడి పందేల బరిని జేసీబీతో దున్నిస్తున్న పోలీసులు

కొనసాగుతున్న గాలింపు చర్యలు

సామర్లకోట: స్థానిక గోదావరి కాలువలో దూకిన వ్యక్తి కోసం శనివారం కూడా పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు సాగించారు. పెదపూడిలో లోకల్ పేపర్ విలేకరిగా పని చేస్తున్న షేక్ సలీమ్ (36) గురువారం రాత్రి స్థానిక రైల్వే గేట్ ఎదురుగా ఉన్న గోదావరి కాలువపై ఉన్న నూతన వంతెన నుంచి గోదావరి కాలువలో దూకిన విషయం విదితమే. గురువారం రాత్రి నుంచి బంధువులతో పాటు పోలీసులు గోదావరి కాలువలో గాలిస్తున్నారు. అయితే శనివారం రాత్రి వరకూ సలీమ్ ఆచూకీ లభించ లేదని పోలీసులు తెలిపారు. కాలువలో గుర్రపు డెక్క కారణంగా గాలింపునకు అంతరాయం కలుగుతుందని సీఐ ఎ.కృష్ణభగవాన్ తెలిపారు.

ఆకట్టుకున్న మ్యాజిక్ చదరం

సామర్లకోట: స్వామి వివేకానంద 162వ జయంతిని పురస్కరించుకుని సామర్లకోటకు చెందిన విద్యార్థి తోటకూర సాయివంశీ అంకెలతో తయారు చేసిన మ్యాజిక్ చదరం ఆకట్టుకుంది. మ్యాజిక్ చదరంలో ఏ నాలుగు అంకెలు కూడినా స్వామి వివేకాందుని జయంతి 162 వస్తుందని సాయివంశీ తెలిపారు. ఆదివారం వివేకానంద జయంతిని పురస్కరించుకుని అంకెలతో మ్యాజిక్ చదరం తయారు చేశానన్నారు. చదరంలోని నిలువు, అడ్డు, కర్ణాలతో పాటు, రంగులు వేసిన ఏ నాలుగు అంకెలు కూడినా 162 వచ్చే విధంగా చదరం తయారు చేయడం విశేషం. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ విద్యార్థి సాయివంశీని పలువురు అభినందించారు.



తోటకూర సాయివంశీ

52	31	42	37
41	38	51	32
35	40	33	54
34	53	36	39

స్వామి వివేకానంద 162వ జయంతి సందర్భంగా రూపొందించిన మ్యాజిక్ చదరం

కాగా స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని స్థానిక స్టేషన్ సెంటర్‌లో వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి, పేదలకు నిత్యావసర వస్తువులు అందజేయనున్నట్లు మదర్ థెరిసా వలంటీర్ ఆర్గనైజేషన్ అధినేత జి.రాజు మాస్టారు తెలిపారు.

ఎ'టైపు' వెళ్తుంది!

- కనుమరుగవుతున్న టైపు మెషీన్లు
- కంప్యూటర్ల రాకతో తగ్గిన ప్రాధాన్యం
- పెద్దాపురంలో ఒకే ఒక ఇనిస్టిట్యూట్

సామర్లకోట: టైపు ఇనిస్టిట్యూట్‌లు నేడు కనుమరుగయ్యాయి.. పెద్దాపురం నియోజకవర్గంలో సుమారు 30 వరకూ ఉండే ఇవి కనిపించకుండా పోయాయి. టకటక శబ్దంతో ఎంతో మందికి ఉపాధి కల్పించిన టైపు రైటింగ్ మెషీన్లు నేడు దూరమయ్యాయి. ఏ ప్రైవేట్ కంపెనీలోకి ఉద్యోగం కోసం దరఖాస్తు చేసినా టైపు లోయర్, హైయర్ సర్టిఫికెట్లు కావాల్సి వచ్చేది. దీనితో పాటు కొన్ని కంపెనీలు షార్ట్ హ్యాండ్ అర్హతను చూసి ఉద్యోగాలు ఇచ్చేవి. సామర్లకోటలో 11, పెద్దాపురం మున్సిపాలిటీ పరిధిలో 19 టైపు ఇనిస్టిట్యూట్‌లు ఉండేవి. గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువతీ, యువకులు టైపు ఇనిస్టిట్యూట్‌లకు వచ్చేవారు. సామర్లకోటలో ఇనిస్టిట్యూట్‌లు పూర్తిగా మూతపడగా పెద్దాపురంలో ఒక ఇనిస్టిట్యూట్ అరకొర విద్యార్థులతో కొనసాగుతోంది. గతంలో ఉదయం, సాయంత్రం విద్యార్థులతో ఇనిస్టిట్యూట్‌లు కళకళలాడుతూ ఉండేవి. వేసవి సెలవులలో వీటికి మరింత డిమాండ్ ఉండేది. ప్రతి ఆరు నెలలకు ఒకసారి విద్యార్థులను ఇంగ్లిషు, తెలుగు లోయర్, హైయర్ టైపు పరీక్షలకు టైపు ఇన్స్టిట్యూట్ నిర్వాహకులు పంపే వారు. నేడు కంప్యూటర్ యుగం అడుగు పెట్టడంతో టైప్ ఇనిస్టిట్యూట్‌ల రెన్యూవల్ 2025తో నిలుపుదల చేసినట్లు తెలిసింది. పదో తరగతి పరీక్షలు రాసిన వెంటనే విద్యార్థులు మరుసటి రోజు నుంచే టైపు నేర్చుకోవడానికి ఇనిస్టిట్యూట్‌ల చుట్టూ తిరిగేవారు. ఆంధ్రప్రదేశ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ బోర్డు ఏడాదికి రెండు పర్యాయాలు నిర్వహించే టైపు రైటింగ్ పరీక్షలకు వందలాదిగా విద్యార్థులు హాజరయ్యేవారు. ఇంటర్ పూర్తి చేసుకునే నాటికి టైపు ఇంగ్లిషు, తెలుగు లోయర్, హయ్యర్ పరీక్షలు పూర్తి చేసుకునేవారు. దీంతో పాటు షార్ట్ హ్యాండ్ నేర్చుకుని ఆ పరీక్షలకు సిద్ధం అయ్యేవారు. టైపు మెషీన్ల కాలమంతా ఒక స్వర్ణయుగంగా ఉండేది. యంత్రాలు వచ్చి కూలీలకు కష్టం తెచ్చిన విధంగానే కంప్యూటర్ల రాకతో టైపు మెషీన్లకు ప్రాధాన్యం తగ్గింది. దాంతో టైపు ఇనిస్టిట్యూట్‌లకు గడ్డుకాలం దాపురించింది. టైపు మెషీన్లు రిపేర్లు చేయడానికి మెకానిక్‌లు కూడా కనుమరుగయ్యారు. అనేక సంస్థలు ఉచితంగా యువతకు కంప్యూటర్ శిక్షణ ఇవ్వడానికి ముందుకు వస్తున్నాయి. ఇందులో భాగంగానే సామర్లకోట టీటీడీసీలో గ్రామీణ ప్రాంతాల్లోని యువతీ, యువకులకు కంప్యూటర్, ఇంగ్లిష్ స్పీకింగ్ కోర్సులపై శిక్షణ ఇస్తున్నారు.



టైపు నేర్చుకొంటున్న విద్యార్థులు

ఉపాధి కల్పించింది

సుమారు 20 ఏళ్ల కిందట టైప్ నేర్చుకున్నాను. దీంతో ప్రైవేటు సంస్థలో టైపిస్ట్‌గా పని చేశాను. 15 ఏళ్ల కిందట మున్సిపాలిటీలో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగానికి అవకాశం రావడంతో అప్పట్లో నేర్చుకున్న టైపింగ్ ఎంతగానో ఉపయోగపడింది. ఈ మేరకు మున్సిపాలిటీలో అవుట్ సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాను.

–ఏసుబాబు, మున్సిపల్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి, సామర్లకోట

42 ఏళ్లుగా టైపు శిక్షణ



పెద్దాపురంలో రాధా కమర్షియల్ టైపు ఇనిస్టిట్యూట్‌ను 1982లో ప్రారంభించాను. తెల్లవారు జామున 3 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ విద్యార్థులు టైపు నేర్చుకోవడానికి వచ్చేవారు. ప్రస్తుతం 15 మంది టైపు నేర్చుకొంటున్నారు. దీంతో అద్దెలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. 2025 వరకూ మాత్రమే టైపు ఇనిస్టిట్యూట్‌లకు రెన్యూవల్ ఉంటుందని ప్రకటించారు. అయితే రాష్ట్ర యూనియన్ రెన్యూవల్ మరో 10 సంవత్సరాలు పొడిగించాలని కోరుతుంది.

–కొల్లి కోదండ రామయ్య, పెద్దాపురం

దత్తాత్రేయ అలంకరణలో సీతారామస్వామి



భోగి గణపతి పీఠంలో గోపూజ చేస్తున్న భక్తులు

బోట్‌క్లబ్: ధనుర్మాస మహోత్సవాలు, రజిత దశావతార అలంకార ఉత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక మెయిన్ రోడ్డులోని సీతారామస్వామి దత్తాత్రేయ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు స్వామివారికి ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు చేశారు.



దత్తాత్రేయ అలంకరణలో సీతారామస్వామి

వైభవంగా గోపూజ

స్థానిక భోగి గణపతి పీఠంలో గోపూజ నిర్వహించారు. లోక కల్యాణ కారకమైన గోసంపద సర్వం శ్రీకరమని భోగి గణపతి పీఠం వ్యవస్థాపకుడు దూసర్లపూడి రమణరాజు అన్నారు. గోవును ఆరాధించిన వారికి, తల్లిదండ్రులను సేవించిన వారికి ఉత్తమ సద్గతులు కలుగుతాయన్నారు. అనంతరం ఆలయంలో 67వ జపయజ్ఞ పారాయణ చేశారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

బాలాజీచెరువు: ఇండియా మెటీరియలాజికల్ డిపార్ట్‌మెంట్ (ఐఎండీ) వాతావరణ శాఖ ఏర్పడి ఈ నెల 15వ తేదీ నాటికి 150 పూర్తి చేసుకున్న సందర్భంగా కాకినాడ వాతావరణం కేంద్రం మెట్రాలజిస్ట్ ఆఫీసర్ డి.రాంబాబు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా స్థానిక శుభానికేతన్ స్కూల్‌లో విద్యార్థులకు తుపాన్లు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, మాన్సూన్ సీజన్ తదితర అంశాలపై క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 8, 9 తరగతుల విద్యార్థులు 117 మంది పాల్గొన్నారు. ఐఎండీ ప్రాముఖ్యతను రాంబాబు విద్యార్థులకు వివరించారు. తుపాన్లు, భూకంపాలు, ఉష్ణోగ్రతలను ఎలా గుర్తిస్తారనే దానిపై అవగాహన కల్పించారు. అలాగే విమానాలు, హెలికాప్టర్లు ఆకాశంలో ప్రయాణించే సమయంలో వాటికి వాతావరణ రిపోర్టును ఏ విధంగా తెలియజేస్తారనే అంశాలను తెలిపారు. మిలటరీ, పోలీస్ తదితర శాఖల వల్లే 24 గంటల విధులను ఐఎండీ నిర్వహిస్తుందన్నారు. పాఠశాల తరపున అకడమిక్ కో–ఆర్డినేటర్ రమాదేవి క్విజ్, వ్యాసరచన పోటీలకు ఏర్పాట్లు చేశారు. అనంతరం విద్యార్థులకు పాఠశాల హెడ్, కరస్పాండెంట్ సుభాషిణి, ఐఎండీ ఆఫీసర్ రాంబాబు విజేతలకు మెమెంటోలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాకినాడ వాతావరణ శాఖ ఉద్యోగులు మాణిక్యాల రావు, అశోక్, నరసింహమూర్తి, షేక్ రియాజ్, శుభానికేతన్ పాఠశాల ప్రిన్సిపాల్ రజనీ తదితరులు పాల్గొన్నారు.



వాతావరణ శాఖ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా విద్యార్థుల ప్రదర్శన